క్లుప్తంగా

స్కూటర్‌లో రూ.2 లక్షల నగదు చోరీ

చిత్తూరు అర్బన్: స్కూటర్‌లో నగదు ఉంచి బ్యాంకులోకి వెళ్లి వచ్చేసరికి ఆ మొత్తాన్ని ఓ వ్యక్తి చోరీ చేశాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. చిత్తూరు వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. గుడిపాల మండలం పేయనపల్లెకు చెందిన రాజేంద్ర అనే వ్యక్తి కోడిగుడ్ల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం గుడిపాల, వేలూరు ప్రాంతాల్లో కలెక్షన్ తీసుకుని, చిత్తూరులోని నాయుడు బిల్డింగ్ వద్దకు వచ్చాడు. మొత్తం రూ.3 లక్షల కలెక్షన్ డబ్బులు ఉండగా ఇందులో రూ.లక్ష బ్యాంకులో వేయడానికి తీసుకుని మిగిలిన రూ.2 లక్షలు తన స్కూటర్ డిక్కీలో ఉంచి లోపలికి వెళ్లాడు. ఆ మొత్తం బ్యాంకులో డిపాజిట్ చేసి బయటకు వచ్చి చూసేసరికి స్కూటర్‌లో ఉన్న నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిరవధిక దీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీ నుంచి నిరవధిక దీక్షలు నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర నాయుడు, జీవీ రమణ తెలిపారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. పలు సమస్యల పరిష్కారం కోసం నిరవధిక దీక్షలు నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

ఘనంగా మేరా మట్టి-మేరా దేశ్


మేరామట్టి మేరాదేశ్ కార్యక్రమంలో అధికారులు, నాయకులు

పూతలపట్టు: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ గౌరి అధ్యక్షతన 'మేరామట్టి మేరా దేశ్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని యాదమరి, బంగారుపాళెం, పూతలపట్టు మండలాల్లోని కలశాలలను(మట్టి) తీసుకొచ్చి పూతలపట్టు పురవీధుల్లో, డప్పువాయిద్యాలతో ఊరేగించారు. చిత్తూరుకు చెందిన గ్రేడ్ సంస్థ, నెహ్రూ యువకేంద్రంతో కలిసి ర్యాలీగా వెళ్లి పూతలపట్టులో ప్రతిజ్ఞలు చేశారు. ఎంపీడీఓ గౌరి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని కలశాలలను సేకరించి కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనంలోని దేశనాయకుల నిర్మాణానికి వినియోగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయభాస్కర్, బంగారుపాళ్యం, యాదమరి ఎంపీడీఓలు హరిప్రసాద్, శివరాజ్, ఏఎస్‌ఐ లక్ష్మి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మణి, బాలాజీ, ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడితోటలపై గజ దాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్లు

ఐరాల: మండలంలోని వినాయకపురంలో ఉన్న మామిడితోటలపై మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. గ్రామంలోని రైతు సుబ్రమణ్యానికి చెందిన మామిడి చెట్లను విరిచి, తొక్కి నాశనం చేశాయి. మహిళా రైతు మంజులకు చెందిన మామిడి తోటకు ఏర్పాటు చేసిన రాతి కూసాలను సైతం కూలదోశాయి. రెండు ఎకరాల్లో మామిడి చెట్లను విరిచేశాయి. అలాగే మొరవవడ్డిపల్లెకు చెందిన మరో రైతు వీరభద్రకు చెందిన వరి పంటను నాశనం చేశాయి. సుమారు రూ.30 వేల పంట నష్టం వాటిలినట్లు బాధిత రైతులు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలు



శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

యాదమరి: మండల కేంద్రమైన యాదమరి ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజులపాటు 42వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో 13 జిల్లాల బాల బాలికల జట్లు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ పోటీలను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి ప్రారంభించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఇప్పటికే యాదమరి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శిక్షణ పొందుతోంది. క్రీడామైదాన్నాన్ని సిద్ధం చేస్తున్నారు.

చిత్తూరు: వరాహవతారంలో రాముడు , చిత్తూరు: పార్వతీదేవిగా దుర్గాంబ, గుడిపాల: బాలాత్రిపురసుందరీగా, బాబా ఆలయంలో చాముండేశ్వరీదేవిగా అలంకారం, బాబాకు తమలపాకుల అలంకరణ








చిత్తూరు: లలితాదేవిగా ముత్యాలమ్మ


గుడిపాల: పార్వతీదేవిగా అలంకరణ

పార్వతీ పాహిమాం..

చిత్తూరు రూరల్: నగరంలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు బుధవారం రాత్రి వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. గిరింపేటలోని దుర్గాంబ పార్వతిదేవిగా దర్శనమిచ్చారు. కోదండరామస్వామి ఆలయంలో వరాహావతారం, ముత్యాలమ్మ ఆలయంలో లలితా దేవిగా, అంకాళ పరమేశ్వరి ఆలయంలో విభూది, అన్నపూర్ణాదేవిగా భక్తులను కటాక్షించారు. భక్తులు అమ్మవారి దర్శనార్థం ఆయా మండపాల వద్ద క్యూ కట్టారు. కట్టమంచిలోని షిరిడీ విశ్వసాయిబాబా ఆలయంలో అమ్మవారిని చాముండేశ్వరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శేషాపీరన్ వీధిలోని సాయిబాబా ఆలయంలోని బాబు తమల పాకులతో అలంకరించారు. ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శన భాగ్యం కల్పించారు. ఉభయదారులను సన్మానించి, భక్తులకు పసుపు కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సుబ్రమణ్యస్వామి ఆలయంలో..

గుడిపాల:మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా కొనసాగుతున్నాయి. కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం మూలస్థాన దుర్గమ్మ పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పల్లూరులోని గంగమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రులు

ఐరాల: దేవీశరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం స్థానిక గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారు వారాహి దేవి, అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్ గేటులోని చాముండేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉభయదారులుగా యల్లంపల్లె గ్రామస్తులు వ్యవహరించారు.

కంభాదేవిగా మరగదాంబికా దేవి

కాణిపాకం(యాదమరి): కంభాదేవి అలంకరణలో మరగదాంబికా దేవి బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో కాణిపాకంలోని మరగదాంబికా దేవి ఆలయంలో వేకువజామున ప్రత్యేక అభిషేకాలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కుంకుమార్చన, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

మహాలక్ష్మిగా కాళికా మాత

కాణిపాకంంలోని కాళికామాత ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు, పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు మహాలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా ముత్యాలమ్మ

బంగారుపాళెం: గ్రామదేవత ముత్యాలమ్మ అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు మురళీగురుకుల్ ఆలయ చైర్మన్ కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా వజ్రాలపురం గంగమ్మ

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ బుధవారం శ్రీరాజరాజేశ్వరీదేవిగా భక్తులను కటాక్షించారు. అమ్మవారి మూలవిగ్రహాన్ని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, ఆలయ మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.









ఐరాల: వారాహిదేవిగా, అన్నపూర్ణాదేవిగా పాలేటమ్మ, మహాలక్ష్మిగా చాముండేశ్వరి, బంగారుపాళెం: అన్నపూర్ణాదేవిగా ముత్యాలమ్మ, రాజరాజేశ్వరీదేవిగా వజ్రాలపురం గంగమ్మ, కాణిపాకం: కంభాదేవిగా మరగదాంబికా దేవి, మహాలక్ష్మిగా కాళికామాత దేవి

సీఎంఆర్ఎఫ్ రూ.20 లక్షల పంపిణీ


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నియోజకవర్గంలో ఐదు కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.20 లక్షల చెక్కులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వీటిని ఇచ్చారు. చిత్తూరు రూరల్ మండలం తాళంబేడులోని హనీష్ క్యాన్సర్‌తో చనిపోగా వారి కుటుంబీకులకు రూ.9 లక్షలు, నగరంలోని గాంధీరోడ్డులోని అనిల్ బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించగా వారి కుటుంబసభ్యులకు రూ.1.40 లక్షలు, గుడిపాల మండలం నరగల్లుకు చెందిన నాగరాజులు బ్రెయిన్ సమస్యతో మరణించగా రూ.7 లక్షలు, తాళంబేడుకు చెందిన సాంబమూర్తి చేయి ఫ్రాక్చర్ అవడంతో రూ.60 వేలు, గుడిపాలలోని బొమ్మసముద్రానికి చెందిన జనార్దన్ లివర్ సమస్యతో చికిత్స పొందగా రూ.2 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఆనంద పార్థసారథి, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు టీమ్ము, రూరల్ పార్టీ అధ్యక్షులు త్యాగ, సర్పంచ్ రజనీకాంత్ పాల్గొన్నారు.

శిఖండి సినిమా ప్రారంభోత్సవానికి ఆహ్వానం

ప్లాస్టిక్ నిషేధంపై చిత్తూరులో చిత్రీకరించనున్న శిఖండి సినిమా ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఆహ్వానించారు. ఆయన నివాసంలో బుధవారం చిత్ర నిర్మాత, దర్శకుడు కోడికిషోర్ మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యాప్తి, నష్టాలు, మనవంతు నివారణ అనే అంశంపై సందేశాత్మక సినిమా తీయనున్నట్లు కోడికిషోర్ తెలిపారు. స్థానిక మిట్టూరులోని శివాలయంలో ఈనెల 23న షూటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో ఎమ్మెల్యే పీఏ చంద్రశేఖర్ ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. గతంలో చెట్ల ఆవశ్యకతపై గ్రీన్‌మ్యాన్ అనే షార్ట్‌ఫిల్మ్ తీసినట్లు గుర్తుచేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

చిత్తూరు రూరల్: అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం మేరా మట్టి-మేరా దేశ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, సిబ్బంది కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, ఎంఈఓ సెల్వరాజ్, వైస్ ఎంపీపీ జయరాం, మండల కన్వీనర్ త్యాగరాజులు, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను గెలిపించుకుందాం


తవణంపల్లె: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


రైతుకు లైసెన్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

తవణంపల్లె: జగనన్నను మరో సారి సీఎంగా గెలిపించుకుందామని అందుకోసం పార్టీ శ్రేణులందరం కలిసికట్టుగా పనిచేద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులనుద్దేశించి ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ లబ్ధిని వివరించాలన్నారు. గృహసారథులు పనితీరు కనబరచాలని లేకుంటే, మార్పు తప్పదని హెచ్చరించారు. మతం, కులం, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలందిస్తున్నట్లు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సి హరిరెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు రమణారెడ్డి, కిషోర్ రెడ్డి, ప్రకాష్‌బాబురెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, రవిరెడ్డి, యుగంధర్ రెడ్డి, డేవిడ్, ప్రకాష్‌రెడ్డి, మధుకుమార్ రెడ్డి, సుభీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి చెబుదాం

పూతలపట్టు: వచ్చే ఎన్నికల్లో సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని బాలాజీ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల్లో దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించారన్నారు. సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిట్లోకి తీసుకొచ్చారన్నారు. ఈ విషయాలన్నీ ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పెనుగొండ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు బాబురెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు జయచంద్రారెడ్డి, నాయకులు రాజారత్నంరెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ ద్వారకనాధరెడ్డి, మురళీకృష్ణ, జెడ్పీటీసీ దేవిక, సింగిల్‌విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, వ్యవసాయ అధ్యక్షులు కోదండ రెడ్డి, కో-ఆప్షన్‌మెంబర్ ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఐరాల: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేసుకున్న ఆరుగురు రైతులకు ఉచితంగా రూ.99.2 లక్షలు విలువ చేసే బోరు మోటార్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వ్యవసాయాన్ని పండుగలా మార్చి అన్నదాతలకు దన్నుగా నిలిచారన్నారు. రైతన్న సంక్షేమం కోసం విప్లవాత్మక సంస్కరణలు అమల్లోకి తెచ్చారని చెప్పారు. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంట బీమా, వైఎస్సార్ యంత్ర సేవ, వ్యవసాయానికి 9 గంటల ఉచిత విద్యుత్, ధరల స్థిరీకరణ తదితర పథకాలను ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజు, ఏపీఓ సంధ్య, పార్టీ నేతలు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ఆరోగ్యానికి శ్రీరామరక్ష



గుడిపాల: పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐరాల: వృద్ధుడికి కళ్లద్దాలను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

గుడిపాల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పేయనపల్లె సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం జిల్లా అంధత్వ సంస్థ ఆధ్వర్యంలో కళ్లద్దాలను వృద్ధులకు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాల గురించి సీడీపీవో ఆయనకు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు ఆనంద పార్థసారథి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రజనీకాంత్, వైఎస్సార్ సీపీ నాయకులు శిలంబరసన్, గుండుసాయి, ప్రకాష్, దీన, ఫ్రాంక్లిన్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

ఐరాల: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని ఐలవారిపల్లె సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు పేద ప్రజలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌లోని వంటకాలను ఎమ్మెల్యే రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దృష్టి లోపం ఉన్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు 320 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, వైస్ ఎంపీపీ నిత్య, సర్పంచ్ వెంకటస్వామి, డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, రామారావు, చందన, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.



యాదమరి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివరాజ్, గుడిపాల: సురక్షకు హాజరైన జనం

320 మందికి వైద్య సేవలు

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ మాలతీప్రతాప్, ఎంపీటీసీ సభ్యుడు రవీంద్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, పేదల ఆరోగ్యమే జగనన్న ధ్యేయమన్నారు. మారుమూల అటవీ గ్రామాల్లో సైతం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజల ఆరోగ్యానికి అండగా ఉంటున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా కళ్లద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ అనీల్‌కుమార్, డాక్టర్లు రమేష్, సుదీర్, సంధ్య పాల్గొన్నారు.

అందరికీ ఉచిత వైద్యం

యాదమరి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో అందరికీ ఉచితంగా వైద్యం అందిస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. 184 గొల్లపల్లె సచివాలయ పరిధిలో బుధవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అందులో రోగులకు చికిత్సలు నిర్వహించి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

గాంధీ అవార్డు




డ్రాయింగ్ మాస్టర్ దామోదర ఆచ్చారి

డ్రాయింగ్ మాస్టర్‌కు అవార్డులు

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా విధులు నిర్వహించే దామోదర ఆచ్చారిని మహాత్మాగాంధీ, కళారత్నం అవార్డులు వరించాయి. అజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో కళా రత్నం ఆర్ట్ ఫౌండేషన్, బరేలి(ఉత్తరప్రదేశ్)వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ ఆర్ట్ కాంటెస్ట్‌లో ఫ్యామిలీ అనే ఆధునిక శైలిలో అక్రిలిక్ రంగులతో వేసిన చిత్రానికి కళారత్నం అవార్డు లభించింది. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా తమిళనాడులోని సి.ఏ.సి అకాడమీ కోయంబత్తూర్ వారు నిర్వహించిన నేషనల్ ఆన్‌లైన్ ఆర్ట్ కాంటెస్ట్‌లో జాతికి అంకితం అనే తైలవర్ణ చిత్రానికి 3వ ర్యాంకు రావడంతో మహాత్మా గాంధీ అవార్డు గెల్చుకున్నారు.


కళారత్నం అవార్డు గెలుచుకున్న ఫ్యామిలీ చిత్రం